క్లుప్తంగా

పర్యావరణ హితంగా పండగ జరపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సామర్లకోట: దీపావళి పండగను పర్యావరణ హితంగా, శబ్ద రహితంగా జరుపుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం దీపావళిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీపావళి అంటే నిప్పులతో చెలగాటమని, అతి జాగ్రత్తగా బాణసంచా కాల్చాలన్నారు. ఎకో క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ అయోధ్య రామపురం, పుర వీధుల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎఎల్‌వీ కుమారి, జి.గోవిందు, కె.శ్రీనివాసు, వి.రాజు, ఎ.శ్రీవల్లీ, పి.బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సిలిండర్లు సద్వినియోగం చేసుకోండి

సామర్లకోట: కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నవంబర్ ఒకటి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తారని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర సభ్యురాలు తుమ్మల పద్మజ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ నాయకులు కాటం రెడ్డి ఏడుకొండలు, పెన్నాడ జగన్నాథ్, అల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో



ఘటనా స్థలంలో ఆటో వద్ద పడి ఉన్న బైక్

సామర్లకోట: ఉండూరు రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఉండూరు గ్రామం నుంచి గొంచాల మీదుగా కాకినాడ వెళుతున్న మోటార్ బైక్‌ను వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొంది. దాంతో మోటారు సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై మురళీ మోహన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు అందాల్సి ఉందన్నారు.

బాధితుడికి విద్యార్థుల ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: గత కొంతకాలంగా బోయి మధు అనే వ్యక్తి కిడ్నీల సమస్యతో, అనారోగ్యానికి గురై బాధపడుతున్నాడు. స్థానిక వీవీఎస్ పాఠశాల విద్యార్థులు అతడికి బుధవారం రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఆర్థికసాయం చేసిన విద్యార్థులను కరస్పాండెంట్ కృష్ణరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

సంప్రదాయబద్ధంగా తాడిపెద్దుకు అంత్యక్రియలు



మృతి చెందిన తాడిపెద్దును ఊరేగిస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పిచ్చికుక్క దాడిలో గాయపడి మృతి చెందిన గ్రామ తాడిపెద్దుకు గ్రామస్తులు బుధవారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో పిచ్చి కుక్క కరవడంతో తాడిపెద్దు మృతి చెందింది. పిచ్చికుక్క దాడి చేసి తాడిపెద్దును కరవడంతో, గత నాలుగు రోజులుగా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న తాడిపెద్దును స్థానికులు గుర్తించి, తాడేపల్లిగూడెం నుంచి మందును సైతం తెచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం అర్ధరాత్రి మరణించడంతో బుధవారం ఉదయం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి, గజ్జాలమ్మ గుడి సెంటర్లో ఖననం చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చీకటి వెలుగుల రంగేళి

- దీపావళి పండగకు సర్వం సిద్ధం
- ఒకవైపు దీపాల వెలుగులు, మరోవైపు టపాసుల మోత
- బాణసంచా విక్రయాలతో మార్కెట్ కళకళ



వేట్లపాలెంలోని బాణసంచా దుకాణాలు



సామర్లకోటలో దీపావళ సామగ్రి విక్రయానికి ఏర్పాటు చేసిన బాణసంచా షాపులు



సామర్లకోట మఠం సెంటర్‌లో ప్రమిదల అమ్మకం

సామర్లకోట: దీపావళి వచ్చిందంటే పిల్లలు పెద్దలు ఎంతో ఆనందోత్సాహాలతో గడుపుతారు. ప్రతి ఏడాది ఆశ్వయుజ మాసం అమావాస్య రోజున దీపావళి పండగ జరుపుకోవడం ఆనవాయితీ. చెడుపై మంచి సాధించిన విజయానికి ఇది చిహ్నంగా పెద్దలు చెబుతుంటారు. కులమతాలకతీతంగా అందరూ జరుపుకొనే పండగ దీపావళి. ముందుగా నిర్దేశించిన ప్రకారం గురువారం దీపావళి జరపడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వం సిద్ధం చేసుకున్నారు. దీపావళి సామగ్రి, ప్రమిదల కొనుగోలుకు జనం తరలిరావడంతో బుధవారం మార్కెట్లు కిటకిటలాడాయి. మహిళలు మట్టి ప్రమిదలు కొనుగోలు చేయడంలోను, పిల్లలు, పెద్దలు దీపావళి సామగ్రి కొనుగోలు చేయడంలోను బీజీ బీజీగా గడిపారు.

24 దుకాణాలకు అనుమతి

బాణసంచా విక్రయాల కోసం అధికారులు వివిధ ప్రాంతాల్లో 24 దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. సామర్లకోట పట్టణంలో 13, వేట్లపాలెంలో 9, పీబీ దేవం ఒకటి, ఉండూరు ఒక షాపు ఏర్పాటుకు కఠిన నిబంధనలతో కూడిన అనుమతులు మంజూరు చేశారు. అగ్ని మాపక, రెవెన్యూ, పోలీసు అధికారుల సంయుక్తంగా పర్యవేక్షణ చేసి, తాత్కాలిక అమ్మకాలకు లైసెన్సులు ఇచ్చారు.

సందడి కనుమరుగు

ఇలాఉండగా జనంలో దీపావళి పండగ వాతావరణం కనిపించడం లేదు. గత ఏడాది దీపావళిని ఎంతో ఆనందంగా జరుపుకొన్నారు. నేడు ఆ సందడి కనిపించడం లేదు. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా షాపులు వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా తగ్గిపోయింది. ఉద్యోగులకు నెలాఖరు రోజులు, రైతులకు పంట కోతల సీజన్ కావడంతో బాణసంచా కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు కావడంతో జనానికి ఆర్థిక దన్ను ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక హామీలను సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, నిత్యావసర సరకుల దరలు విపరీతంగా పెరిగిపోవడంతో పండగలు చేసుకోవాలంటేనే భయపడుతున్నారు. దీపావళి పిండి వంటల పైనా ధరల ప్రభావం తీవ్రంగా ఉంది. అలాగే బాణసంచా ధరలూ పెరిగిపోయాయి. గతేడాది రూ.500 ఖర్చు చేసే సామగ్రి, ప్రస్తుతం ఎన్నో రెట్లు పెరిగిందని జనం వాపోతున్నారు.

పండగ వేళ.. పెరిగిన ధరలు ఇలా..

సరకులు	గత ఏడాది(రూ.ల్లో)	ప్రస్తుతం(రూ.ల్లో)
వంట నూనె కేజీ	100	140
బెల్లం కేజీ	45	55
మినపప్పు కేజీ	80	110
బాణసంచా ధరలు కొన్ని..		
మతాబులు(పది)	60	100
కాకర బాక్సు చిన్నవి	100	200
కాకర బాక్సు పెద్దవి	110	250
చిచ్చుబుడ్డి ఒకటి	15	25
చర్చిలైటు ఒకటి	30	50
షాట్స్	100	200

నిబంధనలు పాటించాలి

ప్రతి బాణసంచా షాపు వద్ద నీటి డ్రమ్ములతో పాటు, ఇసుక, అగ్నిమాపక యంత్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం. అగ్నిమాపక యంత్రాలను వినియోగించే విధానంపై అవగాహన కల్పించాం. పట్టణ, మండల పరిధిల్లో షాపులను తరచూ తనిఖీలు చేస్తున్నాం. అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

– ఎ కృష్ణభగవాన్, సీఐ, సామర్లకోట

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్త

పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి. కాళ్లకు చెప్పులు ఉండాలి. పెద్దలు దగ్గరుండి పిల్లలతో బాణసంచా కాల్పించాలి. నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. ఒకరిపై మరొకరు బాణసంచా విసురుకోవడం చేస్తే చర్యలుంటాయి.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

బాణసంచా షాపుల తనిఖీ



సామర్లకోటలో బాణసంచా షాపుల యజమానులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణభగవాన్

పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచాషాపులను పోలీసు, రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. బాణసంచా విక్రయదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. షాపుల సమీపంలో జనం గుంపులుగా లేకుండా చూడాలన్నారు. నీళ్ల డ్రమ్ములు, అగ్నిమాపక పరికరాలతో పాటు, ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అల్లరి మూకలు బాణసంచా షాపుల వద్దకు వచ్చిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ సూచించారు. షాపులకు దూరంగా వాహనాల పార్కింగ్ చేసుకునే విధంగా చూడాలన్నారు. రెండు రోజుల పాటు సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడాకారులు ఆటలకు దూరంగా ఉండాలని యువకులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి సామర్లకోట మండలంలోని హుస్సేన్‌పురం, వేట్లపాలెంలోని బాణసంచా షాపులను పరిశీలించి, అమ్మకందారులకు పలు సూచనలు ఇచ్చారు.

ఆయనేమన్నా అధికారా..?

- శానిటరీ వర్కర్‌పై చర్యలు తీసుకోవాలి
- నగర పంచాయతీ సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: సాధారణ వర్కర్ అయినా అధికారిలా పారిశుధ్య సిబ్బందిపై అజమాయిషీ చలాయిస్తున్న ఎర్రంశెట్టి సత్యమోహన్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, గంటా అప్పలస్వామి, గుళ్ల సుబ్బారావు మాట్లాడుతూ, శానిటరీ మేస్త్రీగా చలామణీ అవుతున్న సత్యమోహన్ నగర పంచాయతీ పరిధిలో కల్యాణ మంటపాల వద్ద నగర పంచాయతీకి చలానా కట్టాలంటూ ఒక్కొక్క కల్యాణ మంటపం నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తూ, నగర పంచాయతీకి జమ చేయడం లేదన్నారు. పట్టణ పరిధిలో 7 సచివాలయాల సెక్రటరీలు ఉండగా, సాధారణ వర్కర్ పారిశుధ్య సిబ్బందిపై అజమాయిషీ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తూ, కల్యాణ మంటపాల వద్దకు సిబ్బందిని, ట్రాక్టర్‌ను పంపిస్తున్నారని తెలిపారు. అలాగే పారిశుధ్య సిబ్బంది వద్ద నుంచి ప్రతి నెలా వారి వేతనంలో కమీషన్ కూడా వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సత్యమోహన్‌ను తొలగించాలని కమిషనర్‌ను కోరారు. అంతకుముందు వరద సహాయక చర్యల కోసం రూ.లక్ష ఖర్చు చేసినట్లు అజెండాలో పొందుపరచడంతో, ఆ బిల్లులు చూపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో ఏఈ ప్రభాకర్ బిల్లులను సభ్యులకు చూపించారు. పట్టణంలో ఇటీవల ఏర్పాటు చేసిన వీధి దీపాలకు సంబంధించిన బిల్లును సభ్యులు తిరస్కరించారు. వీధి దీపాలను టెండర్ల ద్వారానే ఏర్పాటు చేయాలని గతంలోనే తీర్మానించినట్లు స్పష్టం చేశారు. గొల్లప్రోలు పట్టణ పరిధిలో ఉన్న జగనన్న కాలనీకి పది రోజులుగా మంచినీటి సరఫరా జరగడం లేదని, వారికి తక్షణం మంచి నీటి సరఫరా చేయాలని నగర పంచాయతీ సాధారణ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు అధికారులు తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా తమపై ఉందని, పట్టణంలో పనులు సక్రమంగా నిర్వహించడం లేదని కౌన్సిల్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్లు తెడ్లపు అలేఖ్య రాణి, గంధం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు మొగలి దొరబాబు, సింగం నాగేశ్వరరావు, గొల్లపల్లి అచ్చమాంబ, మైనం భవాని, కో–ఆప్షన్ సభ్యుడు మొగలి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెరగాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: ఇతరులకు సేవ చేయాలనే దృక్పథం ప్రతి ఒక్కరిలోను ఆధ్మాత్మికత పెంపొందడం ద్వారానే ఏర్పడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం ఉదయం స్థానిక గాంధీచౌక్‌లో విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివుని, నంది విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన దైవంపై విశ్వాసం ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచారామ క్షేత్ర శ్రీచక్ర పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ, ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, ఆలయ ధర్మకర్త చంద్రు బలరాం, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ట్రస్టు బోర్డు మాజీ అధ్యక్షుడు కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, మాజీ సొసైటీ అధ్యక్షుడు పైబి శ్రీనివాసు, పడాల పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బాణసంచా విక్రయాలు



బాణసంచా సామగ్రి విక్రయిస్తున్న షాపు

కొత్తపల్లి: మండలంలో దీపావళి సందడి ప్రారంభమైంది. బాణసంచా సామగ్రి విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యాపారులు ఈసారి రెట్టింపు ధరలకు బాణసంచాను విక్రయిస్తున్నారు. అయినప్పటికీ కొనుగోలుదారులు భారీగానే బాణసంచా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, మూలపేటల్లో బాణసంచా షాపులను భారీగా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖల నుంచి అనుమతులు పొందిన వారు భారీగా బాణసంచా సరకును ఏర్పాటు చేశారు. అయితే సామగ్రిని విక్రయించే షాపుల వద్ద రక్షణ చర్యలు మాత్రం అంతంతగా ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ జనం విమర్శిస్తున్నారు. కొంత మంది బాణసంచా అమ్మకాలకు అనుమతులు లేకున్నా.. లోపాయికారిగా అమ్మకాలను సాగించడానికి సిద్ధమయ్యారు.

గరుడ వాహనంపై వేణుగోపాలుని గ్రామోత్సవం



గోపాలుని గ్రామోత్సవంలో పాల్గొన్న గరుడ వాహన దాతలు, భక్తులు

పిఠాపురం: పట్టణంలోని స్వయంభు క్షేత్రం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నరక చతుర్దశిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద నూతనంగా చేయించిన ఇత్తడి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచారు. ఆలయం వద్ద నుండి కోటగుమ్మం సెంటర్ పెద్ద మార్కెట్ సినిమా సెంటర్ మీదుగా తిరిగి ఆలయం వరకు ఈ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో భక్తులు స్వామికి హారతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు విజయ జనార్దనాచార్యులు పూజాదికాలు జరిపించారు. ఆలయ సేవా సమితి ప్రెసిడెంట్ చెరుకుపల్లి శ్రీనివాస్, ఈఓ నున్న శ్రీరాములు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రా ఢీకొని యువతి మృతి

కొత్తపల్లి: హైడ్రా ఢీకొన్న ఘటనలో యువతి మృతి చెందింది. ఉప్పాడ–మూలపేట బీచ్ రోడ్డులో బుధవారం రాత్రి సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, ఉప్పాడకు చెందిన ఉమ్మిడి సంధ్య(23) సాయంత్రం అమీనాబాద్ మినీ హార్బర్‌కు వెళ్లి, తిరిగి ఉప్పాడ బీచ్ రోడ్డులో కాలినడకన వెళుతోంది. సిమ్మెంటు స్తంభాలను తరలించే హైడ్రా వాహనం పెట్రోల్ బంక్ సమీపంలో ఆమెను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురం కౌన్సిల్ సమావేశం రసాభాస

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- పలు అంశాల ఆమోదం



పిఠాపురం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

పిఠాపురం: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సప్లిమెంటరీ సమావేశం అంతా రసాభాసగా సాగింది. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన అత్యవసర సప్లిమెంటరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభంలో అజెండాలో అంశాలు చదువుతుండగా, కౌన్సిలర్ బొజ్జ జగదీశ్వరి సాధారణ సమావేశం పెట్టకుండా ఎందుకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారని అని నిలదీశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కమిషనర్‌ను కోరారు. దీనిపై కమిషనర్ నామ కనకారావు మాట్లాడుతూ, గత అజెండాలో రాటిఫికేషన్ అంశాలు రద్దు చేయడంతో కమిటీ నిర్ణయం మేరకు సమావేశం ఏర్పాటు చేయాలని అనుకున్నామని, కమిటీ నిర్ణయం రాక అత్యవసర సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మరో కౌన్సిలర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ, పని చేయాలని అడిగితే.. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని, పని చేయకుండా ఉన్న కాంట్రాక్టర్లపై చర్యలు ఎక్కడని, కాంట్రాక్టర్ సురవరపు సత్తిబాబును బ్లాక్‌లో పెట్టాలంటూ కౌన్సిల్ తీర్మానం చేసినా చర్యల్లేవని నిలదీశారు. అలాగే తలిశెట్టి వెంకటేశ్వరావు మాట్లాడుతూ, పని అడిగితే ఎస్సీ ఎస్టీ కేసులు పెడితే ఎలా అని, కాంట్రాక్టర్ సత్తిబాబు అధికారులపై ఒత్తిడి చేస్తూ ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టించడం సరికాదన్నారు. కాంట్రాక్టర్‌ను మున్సిపాలిటీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మరో కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ, ఈ కాంట్రాక్టర్ వల్ల పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. కింద స్థాయి సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం కాంట్రాక్టర్‌ను తొలగించాలని కోరారు. మరో కౌన్సిలర్ మారవుతూ లలితా దేవి మాట్లాడుతూ, స్కూల్లో ఫ్యాన్లు పనిచేయటం లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు.

'నా ఫ్యాన్లే తీసుకెళ్లాను'

అలాగే అగ్రహారం పాత ట్రెజరీ కార్యాలయంలో ఆరు ఫ్యాన్లు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రైవేటు ఉద్యోగి పెంకె రాంబాబు తీసుకెళ్లారని, ఆ ఫ్యాన్లు ఎక్కడ వాడారని నిలదీశారు. ప్రైవేటు ఉద్యోగి రాంబాబును పిలవగా, తన సొంత నిధులతో ఫ్యాన్లు వేశానని, అందువల్లే వాటిని తీసుకెళ్లాలని కౌన్సిల్‌కి తెలిపారు. అయితే ఇతనిపై పోలీస్ కేసు పెట్టాలని కౌన్సిల్ సభ్యులంతా ముక్తకంఠంతో కమిషనర్‌ను కోరారు. దీనిపై కమిషనర్ సమాధానం ఇస్తూ, నోటీసు అనంతరం కేసు పెడతానని కౌన్సిల్ సభ్యులకు హామీ ఇచ్చారు.

ఆస్తులు అన్యాక్రాంతం!

అలాగే సభ్యులు పెదపాటి నాగేశ్వరరావు, బొజ్జ రామయ్య, కోళ్ల బంగారు బాబు, రాయుడు శ్రీను మాట్లాడుతూ మున్సిపల్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని చెప్పారు. ఇటీవల ఏడవ సచివాలయంలో చోరీ జరిగి కౌన్సిలర్ నల్ల రవణమ్మ ఫిర్యాదు చేసినప్పటికీ.. పోలీస్ కేసు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. సచివాలయంలో 12 కుర్చీలు, ఒక ప్రింటర్, కంప్యూటర్ చోరీకి గురైనట్లు కౌన్సిలర్ ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ కేసు పెట్టినట్టు వివరణ ఇచ్చారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

డ్రైవర్స్ కాలనీ, మోహన్ నగర్ ప్రాంతాల్లో వీధిలైట్లు సరిగ్గా వెలగడం లేదని, దీంతో చోరీలు, జరుగుతున్నాయని బోనసుల శివ, రాయుడు శ్రీను చెప్పారు. అలాగే నాటుసారా రవాణా జరుగుతుందన్నారు. తక్షణం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ ప్రాంతంలో శానిటేషన్ అధ్వానంగా ఉందని, తరచూ తాగునీరు బురదగా వస్తోందని కమిషనర్‌కు తెలిపారు. తరచూ మున్సిపల్ ఆస్తులు, మాయం అవ్వడంతో పిఠాపురం కాదు మాయాపురం అని కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరి ఎద్దేవా చేశారు.

అధికారుల గైర్హాజరు

కౌన్సిల్ సమావేశానికి డీఈ భవానీశంకర్, ఏఈ రత్నవల్లి గైర్హాజరవ్వడంపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఉన్న 19 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ, తదుపరి అత్యవసర సప్లిమెంటరీ సమావేశంలో ఉన్న 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల రెండు అంశాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో అకౌంటెంట్ పద్మజ్యోతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వల్లి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా బాణసంచా దుకాణాలు



గొల్లప్రోలులో ప్రమాదభరితంగా ఉన్న బాణసంచా దుకాణాలు

పిఠాపురం: నిబంధనలన్నీ నీటి మూటలుగా మిగిలాయి. బాణసంచా దుకాణాల ఏర్పాటులో అధికారుల హడావిడి మినహా, ప్రమాదాల నివారణ చర్యలు మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు. గొల్లప్రోలులో దీపావళి సామగ్రి దుకాణాలు ప్రమాదభరితంగా ఉన్నాయి. వాటి సమీపంలోనే మండే స్వభావం ఉన్న కర్ర నుంచి తొలగించిన తొక్కలు పడి ఉన్నాయి. ఏ చిన్న మంట వ్యాపించినా భారీ ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ముందుగానే పరిశీలించాల్సిన అధికారులు దీనిని పట్టించుకోలేదు ఇక తాటిపర్తి, దుర్గాడ, చేబ్రోలులో అయితే టెంట్లలోనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలు ప్రమాదపుటంచుల్లో ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొంగి ప్రవహిస్తున్న డ్రైన్



స్టేషన్ సెంటర్‌లో డ్రైన్ దుస్థితి

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో ఉన్న డ్రైన్ పొంగి ప్రవహిస్తోంది. బసివిరెడ్డి సత్రం నుంచి అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ వరకు ఈ డ్రైన్ ఉంది. ఇందులోని మురుగు నీరు రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ప్రధాన డ్రైన్‌లోకి వెళ్లాలి. బసివిరెడ్డి సత్రం వద్ద డ్రైన్ నీరు పొంగి ప్రవహిస్తోంది. అనేక మంది డ్రైన్‌పై శ్లాబ్‌లు వేశారు. దీంతో పూడికతీతకు అవకాశం లేకుండా పోయింది. హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను వేయడం వలన డ్రైన్ స్తంభిస్తోందని స్థానికులు అంటున్నారు. దాంతో డ్రైన్‌లో దుర్వాసన వెదజల్లుతోంది. బస్సు కాంప్లెక్స్ ఇన్‌గేట్, అవుట్‌గేట్‌కు చెందిన కల్వర్టులను ఓపెన్ చేసి పూడికలు తీయాల్సి ఉంది. పోలీసు అవుట్ పోస్టును డ్రైన్‌పై నిర్మించడం వల్ల పూడికలు తీయడానికి అవకాశం ఉండడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.36 లక్షలతో డ్రైన్లలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. బస్సు కాంప్లెక్స్ కల్వర్టులు, అవుట్ పోస్టు వద్ద పూడికలు తొలగించకపోతే ప్రయోజనం శూన్యమనే విమర్శలు వస్తున్నాయి పూడికతీత పనులకు సంబంధించి వివరణ ఇవ్వాలని సమాచార హక్కు చట్టంలో సీనియర్ రాజకీయ నాయకుడు బిక్కన రంగ కమిషనర్ శ్రీవిద్యకు ఇటీవల వినతిపత్రం అందజేశారు. స్టేషన్ సెంటర్‌లో డ్రైన్ పరిస్థితిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌ను వివరణ కోరగా, శానిటరీ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి, పూడిక తీయిస్తామని చెప్పారు.